సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025




ప్లాంటేషన్ సంరక్షణపై దృష్టి

టేకు ప్లాంటేషన్ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పీసీసీఎఫ్ చలపతిరావు రేంజ్ అధికారులను ఆదేశించారు. రామనర్సాపురంలో ప్లాంట్‌ను పరిశీలించారు. 8లో ▸



పాస్టర్ మృతిపై నిరసనలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిరసనలు హోరెత్తాయి. ప్రవీణ్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ చేయాలని క్రైస్తవులు శాంతి ర్యాలీలు చేపట్టారు. 8లో ▸



'డైట్'లో పోస్టులకు దరఖాస్తులు

దూబచర్లలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో వివిధ విభాగాల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్టు ఏలూరు డీఈఓ తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆక్వా సాగులో సాంకేతికత అవసరం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: ఆక్వా సాగులో **అధిక దిగుబడులు** సాధించడానికి నూతన **సాంకేతిక పరిజ్ఞానం,** వినియోగంపై రైతులు **అవగాహన పెంచుకో**వాలని జేసీ టి.రాహుల్‌**కుమార్ రెడ్డి అన్నారు.** గురువారం కలెక్టరేట్‌లో **మత్స్యశాఖ అధికారు**లతో ఆయన సమీక్షించారు. **రైతులు వినియో**గిస్తున్న అధునాతన పరికరాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. యంత్ర పరికరాల వాడకం వల్ల విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఆక్వాసాగు విస్తీర్ణం 1,33,037 ఎకరాలకుగాను 50,732 ఎకరాలు మాత్రమే రిజిస్టరైందని, మిగిలిన విస్తీర్ణాన్ని రిజిస్టర్ చేయించాలని ఆదేశించారు. ముందుగా ఆక్వా ఎక్స్ఛేంజ్, కౌంట్ 366 సంస్థలు ఉపయోగిస్తున్న అధునాతన పరికరాలు పవర్ మాన్, స్టార్టర్స్, ఆక్వా బోర్డ్స్ నిర్వహణ గురించి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, మత్స్య శాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎన్ఎన్ రాజు, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కేసుల పరిష్కారానికి చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): ట్రిబ్యునల్‌కు వచ్చే కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ రెండో సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రతి వారం పీజీఆర్ఎస్‌లో వృద్ధుల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వృద్ధుల సంరక్షణ కోసం ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బోర్డులను ఏర్పాటుచేస్తామన్నారు. వృద్ధులు వారి పిల్లల ద్వారా వేధింపులకు గురైతే రాతపూర్వకంగా ఆర్డీఓలకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007 అవగాహన వాల్‌పోస్టర్‌ను డీఆర్వో ఆవిష్కరించారు. సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, డీఎంహెచ్ఓ జి.గీతాబాయి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.నారాయణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఏఎస్ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు ఉదయం 100 మందికి 95 మంది, మధ్యాహ్నం 101 మందికి 95 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పర్యవేక్షకుడు బి.సూర్యనారాయణమూర్తి తెలిపారు.

ఏలూరులో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో గురువారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్–2 పరీక్షలకు 260 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో 153 మందికి 137 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 133 మందికి 123 మంది హాజరయ్యారు. సిటీ కో–ఆర్డినేటర్ పి.సాయికుమారి శంకర్ పర్యవేక్షించారు.

స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో ప్రారంభమైంది. జిల్లాకు 1,85,500 జవాబు పత్రాలు, దూరవిద్యకు సంబంధించి 15 వేల జవాబు పత్రాలు వచ్చాయని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. మూల్యాంకన విధులకు మొత్తంగా 1,300 మందిని నియమించామన్నారు.

సాగర్ జలాల సరఫరా పరిశీలన

నూజివీడు: నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) ఎడమ కాలువ పరిధిలోని 3వ జోన్‌కు తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. గురువారం 5.961 కిమీ వద్ద ఉన్న రెగ్యులేటర్ దగ్గర సాగర్ జలాల సరఫరాను ఎన్నెస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు. నూజివీడు బ్రాంచి కాలువకు 500 క్యూసెక్కులు, మైలవరం బ్రాంచి కాలువకు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా దానిని మరింత పెంచాలన్నారు. నూజివీడు డివిజన్ కార్యాలయంలో వీరబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 1,635 క్యూసెక్కులు విడుదల చేసిందని, 1,190 క్యూసెక్కుల డిశ్చార్జి రాగా దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. అయినా మైలవరం బ్రాంచి కాలువ పరిధిలో శివారు ప్రాంతాలు మూలపాడు, ఇబ్రహీంపట్నం, చెవుటూరుకు సాగునీరు అందడం లేదన్నారు.

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్టు' ఉంది రొయ్యల రైతుల పరిస్థితి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత ఉత్పత్తులపై 26 శాతం పన్నులు విధిస్తామనడం ఆక్వా రైతులపై ప్రభావం చూపుతోంది. **దీనిని సాకుగా చూపించి ఎగుమతిదారులు రొయ్య రేట్లను అమాంతం తగ్గించేశారు. కౌంట్‌ను బట్టి రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.**



అయ్యో..రొయ్యో

ట్రంప్ టారిఫ్ బాంబ్

- రొయ్యల ధరలపై ప్రభావం
- అమెరికా పన్నుల పెంపును సాకుగా చూపించి ధరలు తగ్గించిన ఎక్స్‌పోర్టర్స్
- 100 కౌంట్ ధర రూ.235 నుంచి రూ.210కి తగ్గింపు
- దిక్కుతోచని స్థితిలో ఆక్వా రైతులు
- 50లోపు కౌంట్ అమెరికాకు, మిగిలినవి ఇతర దేశాలకు ఎగుమతి



భీమవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2.53 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. 60 శాతం వనామీ, మిగిలిన విస్తీర్ణంలో చేపలను పెంచుతున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం వలన రొయ్యల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో పెద్ద మొత్తంలో రొయ్యలు మార్కెట్‌లోకి వస్తుంటాయి. ప్రస్తుతం అధికంగా 80 కౌంట్ నుంచి 100 కౌంట్ వరకు పట్టుబడులు చేస్తున్నారు. ఈ తరుణంలో దేశీయ ఉత్పత్తులపై అమెరికా పన్నులు పెంచిందంటూ గురువారం ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులు ధరలను తగ్గించేశారు. 100 కౌంట్ ప్రస్తుత ధర రూ.235లు ఉండగా రూ.210లకు కొనుగోలు చేస్తున్నట్టు ఆక్వా రైతులు చెబుతున్నారు.

50 కౌంట్‌లోపు అమెరికాకు..

జిల్లా నుంచి అమెరికా, చైనా, యూరప్ దేశాలకు రొయ్యలు ఎగుమతి అవుతుంటాయి. కిలోకు 50 కౌంట్ వచ్చే రొయ్యలు మాత్రమే అమెరికాకు వెళుతుండగా, 60 నుంచి 140 కౌంట్ వరకు ఇతర దేశాలకు వెళుతున్నాయి. కాగా అమెరికా సుంకాలు పెంచనున్నట్టు చేసిన ప్రకటనను సాకుగా చూపించి చైనా, ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే రొయ్య ధరలను తగ్గించేయడం అనుమానాలకు తావిస్తోంది. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు కుమ్మక్కై తమ కష్టాన్ని దోచుకుంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా పన్నులు పెరిగితే ఆ భారం వినియోగదారులపై పడాల్సి ఉండగా అందుకు భిన్నంగా రైతులనే దోచుకోవడం దారుణమంటున్నారు.

సుంకాల మోతతో..

తాజాగా అమెరికా సుంకాల మోత పరోక్షంగా ఆక్వా రంగంపై పడటం రైతులను మరింత నష్టాల్లోకి నెట్టేస్తోంది. రొయ్యల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి సాయం అందకపోగా కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ఆక్వా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేసి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. లేదంటే సాగుకు స్వస్తి చెప్పే పరిస్థితులు ఏర్పడతాయని వాపోతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

రొయ్యల ఫీడ్ తయారీ మెటీరియల్ **ధరలు** తగ్గినా ఆ మేరకు మేత **ధరలు** తగ్గడం లేదు. అలాగే నాణ్య**మైన సీడ్** లభించకపోవడంతో చెరు**వుల్లో** రొయ్య పిల్లలు వేసిన నెల **రోజుల్లోనే** వైరస్ కారణంగా చని**పోవడం**తో రైతులు తీవ్రంగా నష్ట**పోతున్నారు.** ఫీడ్ ధరలపై **ప్రభుత్వం** అజమాయిషీ లేకపోవడం, **నాణ్యమైన** సీడ్ అందించకపోవడంతో **ఒడుదుడుకులు** ఎదుర్కొంటున్నారు. నెల **రోజుల క్రితం 100** కౌంట్ రూ.260 ఉన్న ధర **ఒక్కసారిగా రూ.**230లకు పడిపోవడంతో **ఉమ్మడి జిల్లావ్యాప్తంగా** ఆక్వా రైతులు **రోడ్డెక్కి నిరసనలు** తెలిపారు. ప్రభుత్వం **పట్టించుకోకపోవడం**తో ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఎగుమతిదారులు సిండికేట్ అయ్యి ధరలు తగ్గించేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెంపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల రాస్తారోకోలు చేశారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో పదిరోజుల క్రితం 100 కౌంట్ రూ.240లు పెంచగా కొద్దిరోజుల తర్వాత దానిని రూ.235లకు తగ్గించారు. గత నాలుగు రోజులుగా ఈ ధరే కొనసాగుతోంది. మేతలు, మందుల ధరలు, చెరువుల నిర్వహణ పెరిగిపోవడంతో 100 కౌంట్‌కు రూ.260లు ఉంటేనే కానీ గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



మొగల్తూరు మండలంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం వారతిప్ప మురుగు కాలువలో తూడు, కిక్కిస తొలగింపు పనులను గురువారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ రిజిస్టర్లను పరిశీలించి ఉపాధి హామీ పథకం పనులపై ఆరా తీశారు. కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ రాజ్‌కిషోర్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి ఆమె వెంట ఉన్నారు.

లేసు పార్కుకు పూర్వ వైభవం

లేసు ఉత్పత్తులు, అలంకృతి లేసు పార్కుకు పూర్వ వైభవం తీసుకు వస్తామని కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం నరసాపురం మండలం సీతారామంపురంలో లేసుపార్కును ఆమె సందర్శించారు. కాలనుగుణంలో సరికొత్త డిజైన్లతో లేసు అల్లికలను రూపొందిస్తే మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. ఈ ప్రాంత లేసులకు భౌగోళిక గుర్తింపు రావడం శుభపరిణామమన్నారు. ఆర్డర్లు సాధించి ఎగుమతులు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్డీఓ దాసి రాజు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, లేసు పార్కు మేనేజర్ కుసుమకుమారి ఉన్నారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు



ఎండీ జహంగీర్

ఆకివీడు: ముస్లింల ద్రోహి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ జహంగీర్ అన్నారు. కేంద్రంలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంలో కూటమి ప్రభుత్వం అనుసరించిన తీరుపై గురువారం ఆయన మండిపడ్డారు. సవరణ చట్టం లౌకికవాదానికి చెంపపెట్టు అన్నారు. మత ద్వేషాల్ని రెచ్చగొట్టేలా, ముస్లింల వక్ఫ్ ఆస్తుల్ని స్వాధీన పరచుకునేలా కేంద్రం పన్నిన కుట్రకు చంద్రబాబు వత్తాసు పలికారని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం ఆమోదంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉరి వేసుకున్నట్లేనని జహంగీర్ అన్నారు. అధికారం కోసం ఎన్నికల్లో ముస్లింలకు అండగా ఉంటానని చెప్పి చంద్రబాబు పీఠం ఎక్కిన తర్వాత వారిని విస్మరించారన్నారు. వక్ఫ్ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యతిరేకించారని అన్నారు. దివంగత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ముస్లింలకు అండగా నిలిచింది ఎవరనేది మైనార్టీలు గుర్తించాలన్నారు. ముస్లిం సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి పోరాడాలని పిలుపునిచ్చారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై పోరాటం

భీమవరం: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ద్వారా ముస్లింలకు ఎటువంటి లబ్ధి లేదని భీమవరం ముస్లిం కమిటీ ప్రతినిధులు తెలిపారు. భీమవరంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ఈ బిల్లును కుట్రపూరితంగా తీసుకువచ్చారని, తామంతా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. బిల్లును పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. బిల్లు రద్దు చేసే వరకూ తాము శాంతి ప్రదర్శనలతో పోరాటం చేస్తామని వెల్లడించారు. లా బోర్డు చెప్పిన విధానంతో తాము ముందుకు నడుస్తున్నామని, శాంతి ప్రదర్శనకు ముస్లింలంతా తరలిరావాలని పిలుపు నిచ్చారు. ముస్లిం ప్రతినిధులు షేక్ రబ్బానీ, కరీముల్లా బాషా, సుభానీ, ఖలీల్ బాషా, మొహీద్దీన్, ఫార్హన్, యూత్ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం కమిటీ ప్రతినిధులు

● ఇదేనా గురువులకిచ్చే గౌరవం ?



చెట్ల నీడలో.. నేలపై టీచర్ల పడిగాపులు

చెట్ల నీడలో, అరుగులపై పడిగాపులు కాస్తూ ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం గురువారం ఏలూరు సెయింట్ గ్జేవియర్ బాలుర పాఠశాలలో ప్రారంభం కాగా.. పేరు నమోదు ప్రక్రియ నుంచి మధ్యాహ్నం భోజనం వరకు టీచర్లు పాట్లు పడ్డారు. కనీసం ఉపాధ్యాయులు కూర్చునేందుకు, భోజనాలు చేసేందుకు బెంచీలు, కుర్చీలు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో నేలపై, గట్లపై కూర్చుని భోజనాలు చేశారు. ఇదేనా ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం అంటూ పలువురు బహిరంగంగానే విమర్శించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ



అరుగులపై నిరీక్షిస్తూ..



ఏలూరులో మూల్యాంకన కేంద్రం వద్ద గట్లపై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్న ఉపాధ్యాయులు

నాలుగో వసంతంలోకి నవ పశ్చిమ

- జిల్లాల పునర్విభజనతో మేలు
- పరిపాలనా సౌలభ్యం
- ప్రజలకు చేరువలో జిల్లా అధికారులు
- మూడేళ్లు నిండిన కొత్త జిల్లాలు





భీమవరంలో కలెక్టరేట్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజలకు పాలనను చేరువ చేయడంతో పాటు మరింత మెరుగ్గా అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిని ప్రామాణికంగా తీసుకుని కొత్త జిల్లాలను ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా 2022 ఏప్రిల్ 4న ఏలూరు కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాను రెండుగా విభజించారు. భీమవరం కేంద్రంగా నూతన పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు కేంద్రంగా ఏలూరు జిల్లాలు ఏర్పడ్డాయి. శుక్రవారంతో కొత్త జిల్లాలు మూడేళ్లు పూర్తిచేసుకుని నాలుగో వసంతంలోకి అడుగుపెడుతున్నాయి.

తగ్గిన దూరాభారం

భీమవరం కేంద్రంగా 20 మండలాలతో జిల్లాను ఏర్పాటుచేయడంతో ప్రజలకు పాలన చేరువైంది. జిల్లాలోని ఏ ప్రాంతం వారు అయినా 30 కిలోమీటర్లలోపు జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకుంటున్నారు. గతంలో జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లేందుకు 70 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడేవారు. భీమవరంలో కలెక్టరేట్, జిల్లా అధికారుల కార్యాలయాలు ఏర్పాటుచేయడంతో వీరికి వ్యయప్రయాసలు తప్పాయి. ముఖ్యంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే మీకోసం కార్యక్రమానికి సులువుగా హాజరు కాగలుగుతున్నారు. కలెక్టరేట్ అందుబాటులో ఉండటంతో భోజన సమయానికి పనులు పూర్తిచేసుకుని వారి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

అందుబాటులో ఎస్పీ కార్యాలయం

ప్రజలకు ఏ కష్టం వచ్చిన శాంతి భద్రతలను విషయంలో పోలీసుల సాయం కోసం, ఏదైన సమస్య ఉంటే చెప్పుకోవడానికి, అలాగే స్పందనలో అర్జీలు పెట్టుకోవడానికి జిల్లా ఎస్పీ కార్యాలయం కూడా అందుబాటులో ఉంది. అటు కలెక్టరేట్ ఇటు ఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ప్రజలు సులభంగా ఉపయోగించుకుంటున్నారు. జిల్లా కార్యాలయాలను తమకు అందుబాటులోకి తీసుకువచ్చిన మాజీ సీఎం జగన్ మేలును ప్రశంసిస్తున్నారు.

విపత్తుల వేళ వేగంగా సేవలు

జిల్లాలో ఏ ప్రాంతంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా వేగంగా అధికారులు వెళ్లి సాయం అందిస్తున్నారు. గోదావరి వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులు 30 నిమిషాల్లోపు సంఘటన ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బాధితులకు సకాలంలో సాయం చేయడం, రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఏలూరు నుంచి అధికారులు వచ్చేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయేది. స్థానిక అధికారులు ఉన్నా కూడా ప్రయోజనం లేకుండా ఉండేది.

కొత్త డివిజన్‌లు

నూతన జిల్లా ఏర్పాటుతో నూతన రెవెన్యూ, పోలీసు సబ్ డివిజన్లను కూడా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భీమవరం నూతన రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజన్, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్లు ఏర్పాటయ్యాయి.

జిల్లా వివరాలు

జనాభా	20 లక్షలు
ఓటర్లు	14.40 లక్షలు
విస్తీర్ణం	2,278.35 చ.కి.మీ
రెవెన్యూ డివిజన్‌లు	3
పోలీస్ సబ్ డివిజన్‌లు	3
మండలాలు	20
గ్రామాలు	409
మున్సిపాలిటీలు	6

జిల్లా అభివృద్ధికి జగన్ కృషి

రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటుతో పాటు ఆయా జిల్లాల అభివృద్ధికి గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ విశేషంగా కృషిచేశారు.

- జిల్లాలో 71,200 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేసి గృహ నిర్మాణాలకు రూ.500 కోట్ల మేర ఖర్చు చేశారు.
- రైతుల కోసం రూ.10.56 కోట్లతో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.
- రూ 455.59 కోట్లతో గ్రామ, వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌లు నిర్మించారు.
- రూ.16.14 కోట్లతో పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించారు.
- రూ.86 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- రూ.9.72 కోట్లతో 60 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించారు.
- నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు.
- పట్టణాల్లో రూ.400 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైయిన్లు అభివృద్ధి చేశారు.
- పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు.
- నరసాపురం ప్రాంతంలో రూ.3 వేల కోట్లతో ఆక్వా యునివర్సిటీ, ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్ తదితర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

వ్యయప్రయాసలు తగ్గాయి



జిల్లాల పునర్విభజనతో వ్యయప్రయాసలు తగ్గాయి. గతంలో మా గ్రామం నుంచి జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. కేవలం 8 కిలోమీటర్లలో జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నాం. స్పందన కార్యక్రమానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు చాలా వెసులుబాటుగా ఉంది. ఇదంతా జగన్ చేసిన మేలు

– బి.రాంబాబు, కొండేపూడి

జగన్ మేలు మరువలేం



భీమవరం జిల్లా కేంద్రంగా నూతన పశ్చిమగోదావరి జిల్లాను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేశారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు అందుబాటులో ఉండటంతో సమస్యలను సులభంగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నాం. జిల్లా అధికారులు వేగంగా వచ్చి సమస్యలు పరిష్కరించగలుగుతున్నారు.

– వి.శ్రీనివాస్, తోకలపూడి

క్లుప్తంగా

17 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం లారీని పట్టుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు

చాట్రాయి: మండలంలోని నరశింహారావుపాలెంలో బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు సివిల్ సప్లయ్ డీటీ వెంకటేశ్వరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఒక వాహనంలో 13 టన్నులు, రెండో వాహనంలో 4 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, స్టాకు యజమానులు, వాహనాల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

ఏపీ ఫార్మసీ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక





రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, జిల్లా అధ్యక్షుడు అనిల్

తణుకు అర్బన్: ఏపీ ఫార్మసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం గురువారం తణుకులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఫార్మసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా లుక్కా నరేష్, ఉపాధ్యక్షుడిగా ఇమంది నాగ కృష్ణంరాజు, కార్యదర్శిగా ఎన్. వెంకట రవిశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కోర్ కమిటీ తెలిపింది. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బింకం అనిల్ చక్రవర్తిని ఏకగ్రీవంగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ తెలిపారు. ఫార్మా వ్యవస్థలో నెలకొన్న లోపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి తద్వారా న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షునిగా తనను నియమించడంపై చైర్మన్ సురేష్ బాబు, కోర్ కమిటీ సభ్యులకు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

5న తిరుమల విద్యాసంస్థలో అవగాహన సదస్సు

భీమవరం: భీమవరం పట్టణంలోని తిరుమల విద్యాసంస్థలో ఈనెల 5వ తేదీన జేఈఈ మెయిన్స్, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థల మేనేజింగ్ పార్టనర్ ఎన్ తిరుమలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 99513 94083, 99513 94087 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ఉండి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడని, గురువారం అతడిని భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా

ఏలూరు (మెట్రో): ఈ నెల 4వ తేదీన జరగవలసిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు, సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలు నిర్వహించే తేది త్వరలో తెలియజేస్తామన్నారు.

పాస్టర్ మృతిపై నిరసనల హోరు



టి.నరసాపురం: పాస్టర్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలంటూ క్రైస్తవుల మానవహారం



పాలకోడేరు: నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

టి.నరసాపురం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిరసనలు హోరెత్తాయి. ప్రవీణ్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ చేసి అతడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ క్రైస్తవులు పలుచోట్ల శాంతి ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవ సమాజాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. టి.నరసాపురంలో క్రైస్తవ సంఘాల నాయకులు, విశ్వాసులు స్థానిక హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బి.బెసలేలు, సీహెచ్ హోషేయ, ఆర్.మోషే, బి.రమేష్, వై.పాల్‌చిన్నారావు, నవజీన్‌పాల్, బి.కిషోర్, ప్రేమ్‌కుమార్, ప్రసన్నకుమార్, శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

కామవరపుకోట: క్రైస్తవులపై దాడులు అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై లోతైన సమగ్ర విచారణ జరిపించాలని కర్మేల్ మినిస్ట్రీ పాస్టర్ మోజెస్ డిమాండ్ చేశారు. మండలంలోని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి చెక్ పోస్ట్ మీదగా చౌతన సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గద్దం ఎలీసాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యూనియన్ పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



కామవరపుకోట: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మండల పాస్టర్ యూనియన్ సభ్యులు, క్రైస్తవులు



కొయ్యలగూడెం : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

శాంతి ర్యాలీ

కొయ్యలగూడెం: పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు గురువారం కొయ్యలగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జీడీఎం చర్చి నుంచి వివిధ క్రైస్తవ సంఘాల కాపరులు, విశ్వాసులు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎం.దేవసహాయం మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని కోరారు. సెక్రటరీ బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి దాడులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బి.శామ్యూల్ రాజు, కె.డానియేల్, పాల్ అన్న, బెంజిమెన్, సింగ్, కె.బాబురావు, టీఎన్.స్నేహన్, పాస్టర్లు, క్రై స్తవులు పాల్గొన్నారు.

పాలకోడేరులో ర్యాలీ

పాలకోడేరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేయాలని బిషప్ జెర్మియా, యూపీఏ అధ్యక్షుడు గోపే సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. మండలంలోని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు రావి చెట్టు సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు గోపే సాల్మన్ రాజు, బిషప్ సత్యం మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. సీఐడీ, సీబీఐ సంస్థలతో విచారణ జరిపించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాపు రాజు, విజయ్ కుమార్ ఎలిషా దానియేలు, నికోలస్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టేకు ప్లాంటేషన్ సంరక్షణకు ప్రాధాన్యమివ్వండి

- ఫారెస్ట్ రేంజ్ అధికారులకు ఆదేశం
- టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించిన పీసీసీఎఫ్



రామనర్సాపురం సమీపంలో టేకు ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ తదితరులు

బుట్టాయగూడెం: రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న టేకు ప్లాంటేషన్ సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పీసీసీఎఫ్ డాక్టర్ పీవీ చలపతి రావు ఫారెస్ట్ రేంజ్ అధికారులను ఆదేశించారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన రామనర్సాపురంలో ఉన్న 72–73 టేకు ప్లాంటేషన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెట్ల ఎత్తు, మొదలులోని చుట్టుకొలతలను స్వయంగా పరిశీలించారు. అలాగే ప్లాంటేషన్‌లోని చెట్ల తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టేకు చెట్లను స్మగ్లర్లు నరికి వేయకుండా బీటు స్థాయి ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అటవీశాఖ ఉద్యోగులు అటవీ సంరక్షణ విధులతోపాటు టేకు ప్లాంటేషన్‌ను కాపాడేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే వేసవి కాలం కావడంతో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్‌పాత్, ఫైర్‌లైన్స్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శ్రీశుభం, సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య, కన్నాపురం రేంజ్ అధికారి ఎం.శివరామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో రమణక్కపేటలో ఉన్న టేకు ప్లాంటేషన్‌ను కూడా పీసీసీఎఫ్ చలపతిరావు పరిశీలించారు. జంగారెడ్డిగూడెం రేంజ్ పరిధిలోని అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'డైట్'లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దూబచర్లలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 6 సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ల పోస్టులను డిప్యూటేషన్‌పై భర్తీ చేసేందుకుగాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అమరావతి, ఆంధ్రప్రదేశ్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు సీనియర్ లెక్చరర్ పోస్టులకు, స్కూల్ అసిస్టెంట్లు లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. అభ్యర్థి వయసు 31 మార్చి 2025 నాటికి 58 సంవత్సరాలు మించరాదని, తత్సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం, ఎంఈడీలో 55 మార్కులు పొంది ఉండాలన్నారు. దరఖాస్తుదారులు కనీసం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని, దరఖాస్తు చేసేటప్పుడు రెండు సబ్జెక్టుల్లో అర్హత కలిగి ఉంటే రెండిటికీ ఒక దరఖాస్తు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం డైట్‌లో పనిచేస్తూ మూడేళ్ల సర్వీసు చేసిన వారు అర్హులు కారని, దరఖాస్తును నిర్ణయించిన గూగుల్ ఫామ్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. అభ్యర్థులు గూగుల్ లింక్‌లో ఫిల్ చేసిన వివరాలకు సంబంధించి అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను స్కూల్ అసిస్టెంట్ సంబంధిత డీడీఓ ద్వారా, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సంబంధిత ఉప విద్యాశాఖ అధికారి ద్వారా జిల్లా డైట్ కార్యాలయానికి అందజేయాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ లోపు పూర్తి చేయాలని, ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్షలు, 19వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.


8 నెలల పింఛన్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

దెందులూరు: ఓ వృద్ధుడికి గ్రామ కార్యదర్శులు 8 నెలలుగా వృద్ధాప్యపు పింఛన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారు. పింఛన్ కోసం కార్యదర్శుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయిన ఆ వృద్ధుడు చివరికి హైకోర్టును ఆశ్రయించగా వెంటనే అతడికి పింఛన్ చెల్లించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని గంగన్నగూడెం గ్రామానికి చెందిన మొట్టపర్తి గాంధీ వృద్ధాప్య పింఛన్‌దారు. అయితే 8 నెలలుగా ఆయనకు పింఛన్ అందడం లేదు. దీంతో తనకు న్యాయం చేయాలని హైకోర్టును కోరారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు ఈనెల 1న పింఛన్‌దారు మొట్టపర్తి గాంధీకి 8 నెలలు పింఛన్‌తోపాటు ఏరియర్స్ కలిపి ఇవ్వాలని ఏలూరు జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు 8 నెలల పింఛన్ నగదు రూ.32 వేలు, ఏరియర్స్ రూ.3 వేలు కలిపి మొత్తం రూ.35 వేలకు చెక్కును విడుదల చేశారు. గురువారం గంగన్నగూడెం గ్రామ సచివాలయం కార్యదర్శి కిషోర్, వెల్ఫేర్ అసిస్టెంట్ కిషోర్ ఆ చెక్కును పింఛన్ లబ్ధిదారు గాంధీ ఇంటికి వెళ్లి అందజేశారు.

గోపవరంలో మరో చోరీ

కై కలూరు: గోపవరంలో మరో చోరీ జరిగింది. ఇటీవల గ్రామంలో మూడు దొంగతనాలు చోటుచేసుకున్నాయి. తాళాలు వేసి వెళ్లిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. తాజాగా ఇదే గ్రామంలో మరో దొంగతనం జరిగినట్లు గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కోడూరు వెంకట లక్ష్మీ నాగేశ్వరరావు(66) భార్యతో కలసి మార్చి 29న వైద్యం నిమిత్తం విశాఖపట్టణం వెళ్లారు. తిరిగి ఈ నెల 3వ తేదీన ఇంటికి రాగా తలుపులు పగుల గొట్టి ఉండటం గమనించారు. లోపల పరిశీలిస్తే బంగారు, వెండి కలిపి మొత్తం రూ.60 వేలు విలువ చేసే వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కై కలూరు టౌన్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాటెమ్మ తల్లి జాతరలో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

దెందులూరు: చల్లచింతలపూడిలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీ పాటెమ్మ పేరంటాలు తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. మండుటెండలో కనకనలాడే నిప్పులపై అమ్మవారు ఆవహించిన కమ్మ సత్యవతి అనే భక్తురాలు పాటెమ్మ తల్లి విగ్రహాన్ని చేతపట్టుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆమెతోపాటు ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు యలమర్తి సత్తిబాబు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ నాగనబోయిన సత్యనారాయణ, కమిటీ సభ్యులు యలమర్తి రామ్మోహన్‌రావు, రాముడు, మోహన్, మురళి, పర్వతనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిక్స్ వీక్స్ స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సు

ఏలూరు రూరల్: ఆటలపై ఆసక్తి గల వారి కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు పాటియాలాలోని ఎన్ఎస్ఎన్ఐఎస్ సిక్స్ వీక్స్ స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించనుందని ఏలూరు జిల్లా డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మాస్ స్పోర్ట్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ ద్వారా 6 నెలల పాటు శిక్షణ జరుగుతందని వెల్లడించారు. ఈ శిక్షణపై ఆసక్తి గలవారు మే 6వ తేదీ నుంచి జూలై 2వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫీల్డ్ టెక్నీషియన్ – ఎయిర్ కండిషనర్ కోర్సులో ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన పథకం కింద మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్. ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 11వ తేదీ వరకూ గడువు ఉందని, వివరాలకు 94934 82414 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

దివీస్ కంపెనీకి 18 మంది ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

పెంటపాడు: మండలంలోని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దివీస్ లేబరేటరీకి చెందిన కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కళాశాలల నుంచి 18 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో సైన్స్ విద్యార్థులు 6 గురు ఎంపికయ్యారు. ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ పిన్సిపాల్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి యువీ ప్రేమ్‌సాగర్, కెమిస్ట్రీ ఇన్‌చార్జి సురేంద్ర, జేకేసీ ప్రతినిధులు ఇందరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భారతమాత ఆటో యూనియన్ సభ్యుడు సానబోయిన శ్రీనుకి యూనియన్ ఆధ్వర్యంలో గురువారం రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని అధ్యక్ష, కార్యదర్శులు పంగం రాంబాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ సభ్యులకు అండగా ఉంటూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న యూనియన్ కార్యాలయం వద్ద బాధితుడికి ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

116 మందికి కంటి పరీక్షలు



నీలాద్రిపురంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం కోదండ రామాలయం వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారు 116మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 10మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా, మరో 48మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్టు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు తెలిపారు. మానవత ప్రతినిధులు పైడికొండల సింధు, యర్రా ఆంజనేయ స్వామి, చేకూరి బంగార్రాజు, బురిడి సతీష్, మిరియాల కిషోర్, హరికుమార్, కే.బాలకృష్ణ, చిప్పాడ గురుమూర్తి, ముళ్లపూడి రత్నాజీ, నల్లూరి శ్రీనివాస్, పచ్చా రామకృష్ణ, బుర్రె పృథ్వి, సమయమంతుల కాశి, శివరాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు గానూ నిర్వహించే ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్స్ రెండోవ విడత పరీక్ష రెండోవ రోజు గురువారం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిలాల వ్యా ప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలలో నిర్వహించగా పట్టణంలోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటల పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 180 మందికి 175 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 180 మందికిగాను 176 మంది పరీక్షలకు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరరావు, పరీక్ష కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, కొల్లా సురేష్‌లు పర్యవేక్షించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

తాడేపల్లిగూడెం రూరల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని నవాబుపాలెం – జగన్నాథపురం, మెట్టఉప్పరగూడెం, ఉప్పరగూడెం, అప్పారావుపేట గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అలాగే, జగన్నాథపురం – మాధవరం వరకు రూ.87లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈ జీఎస్ నిధులు సుమారు రూ.3కోట్ల విలువైన రోడ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, సర్పంచ్‌లు మద్దుకూరి గంగాభవాని, ఉండ్రాజవరపు చంద్రిక, ముప్పిడి సూర్యకుమారి, ఆరుగొల్లు శ్రీనివాస్, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నడక ఒంటికి మంచిదేగా...

- నడకతో ఒత్తిడి, ఆందోళన దూరం
- దినచర్యగా మారిన నడక
- నడవాల్సిందే అంటున్న వైద్యులు



తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాకింగ్ ట్రాక్‌లో నడుస్తున్న వాకర్లు. (ఫైల్)

తణుకు అర్బన్: కాలం ఏదైనా ఏ పనిచేయాలన్నా ఒక పక్క బద్ధకంతో పాటు ఒత్తిడి, ఆందోళన, మానసిక అశాంతి మానవ దేహాన్ని కుంగదీస్తున్న అంశాలు. ఇటువంటి రోగాలను అధిగమించాలంటే నడక తప్పనిసరి అంటున్నారు వైద్యులు. రోజుకు 30 నిముషాలు నడిస్తే జీవితకాలం పెంచుకోవచ్చని పెద్ద సంఖ్యలో అనారోగ్యాలు తొలగించుకోవచ్చని తెలుస్తోంది. దీంతో నడక ఒంటికి మంచిదేగా అనే నానుడి అందరిలోనూ కలుగుతోంది. నడకపై కలిగిన అవగాహనతో దినకరుడు రాకముందే పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు, ఖాళీ మైదానాల్లోను, గ్రామాల్లో అయితే ఊరి పొలిమేర వరకు చకచకా నడిచేస్తున్నారు ప్రజానీకం.. ముఖ్యంగా ఉదయం నడక కారణంగా సూర్యరశ్మి శరీరానికి తాకి ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చనే దృక్పథంతో తణుకులో శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వెంకటరాయపురం పార్కు వాకర్స్‌కు వేదికలుగా మారాయి. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తుండగా సీనియర్ సిటిజన్స్ నడక అనంతరం పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్నారు.

పెట్టుబడి లేనిది నడక..

వ్యాయామం చేయాలంటే జిమ్‌లో రుసుము చెల్లించాలి. షటిల్ ఆడాలన్నా, క్రికెట్ ఆడాలన్నా మరొక క్రీడా విభాగంలో పాల్గొనాలన్నా ఖర్చు చేయాల్సిందే. కానీ నడకకు మాత్రమే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండానే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చనేది జగమెరిగిన సత్యం. దీంతో పట్టణాల్లో కళాశాలలు, పాఠశాలల క్రీడా ప్రాంగణాల్లో ఉదయం, సాయంత్రం నడక కోసం వచ్చే వారితో కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో అయితే చెరువు గట్లు పొలాల వెంబడి నడక అందుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కువగా 30 సంవత్సరాలు దాటిన వారిలో 30 శాతం, 40 నుంచి 60 సంవత్సరాలు దాటిన వారు 60 శాతం మంది నడకను దినచర్యగా చేసుకున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఏ రోగమని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించినా మందులతో పాటు ప్రతి రోజూ 30 నిమషాల పాటు నడక తప్పనిసరి అని చెబుతున్నారు. ముఖ్యంగా బీపీ, సుగర్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ నడక ఎంతో మేలు చేస్తుందనేది అమ్మ మాటలా కమ్మగా మారింది. ముఖ్యంగా రక్తప్రసరణ బాగా జరిగి గుండె పనితీరు బాగుంటుందనేది వైద్యుల సూచన.

నడకతో ప్రయోజనాలివే...

- క్రమం తప్పకుండా నడవడం వల్ల ఎండార్ఫిన్స్ అనే హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు అంశాలను అధిగమించవచ్చు.
- గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పనిచేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరిచేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలొస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది.
- కీళ్లు, కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందుకు పూర్తిస్థాయిలో సమతుల్యత తీసుకువస్తుంది.
- శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది.
- శరీరానికి మంచి శ్వాస, అధికస్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది.
- ఎముకలు ధృడంగా తయారవుతాయి.
- మానసికంగా ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇస్తుంది.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- మెదడును ఉత్తేజితం చేస్తుంది.
- విటమిన్ డి లోపం ఉండదు.
- వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

నడక జీవిత కాలాన్ని పెంచుతుంది



ప్రతిరోజూ 30 నిముషాల పాటు నడిచే నడక మనిషి జీవిత కాలాన్ని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. వాతావరణ పరిస్థితులు, ఆహారం తీసుకోవడంలో ప్రస్తుతం తలెత్తిన పరిస్థితుల రీత్యా 30 సంవత్సరాలు దాటిన వారంతా నడకను దినచర్యగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. నడక కారణంగా గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో గుండె సంబంధిత జబ్బులు తలెత్తవు..

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, రిటైర్డు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, తణుకు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని విద్యుత్ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని ఫీడర్ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్ (ఫీడర్ల విభజనలు నిమిత్తం) ఈ నెల 4వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నదని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వన్‌టౌన్‌లో పలు ప్రాంతాలు మెయిన్ రోడ్డు, నల్లజర్ల రోడ్డు, భూపాల్ నగర్, స్టేషన్ రోడ్డు, సిపాయిపేట, కోతిబొమ్మసెంటర్, జూబ్లీరోడ్డు, గణేష్‌నగర్, కొండాలమ్మగుడి రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాల ఏరియా, హౌసింగ్‌బోర్డు, శశి కళాశాల రోడ్డు, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, సత్యవతి నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటకం కలుగుతుందని ఎలక్ట్రికల్ డీఈ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజీపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్వారకా తిరుమలకు ఆర్టీసీ సర్వీసులు

తణుకు అర్బన్: ద్వారకా తిరుమలకు వెళ్లే తణుకు పరిసర ప్రాంత వెంకటేశ్వర స్వామి భక్తుల సౌకర్యార్థం తణుకు నుంచి ప్రతి రోజు ద్వారకా తిరుమలకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశామని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని తణుకు పట్టణ, పరిసర ప్రాంత ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు.

బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ నారాయణరెడ్డి

తణుకు అర్బన్: బీఎల్ఓలు తమ విధి నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఓటరు నమోదు ప్రక్రియతోపాటు తొలగింపును కూడా సక్రమంగా నిర్వర్తించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ నారాయణరెడ్డి అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఓటు హక్కు వయసు వచ్చిన వారి ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకునేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా ఓట్లు తొలగించాల్సిన సందర్భాల్లో కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాలని స్పష్టం చేశారు. ఓటరు పేర్లు, చిరునామా ఇతర వివరాల సరిచేసుకునే క్రమంలో కూడా నిబంధనల మేరకు పని చేయాలన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై తీసుకొనే క్రమశిక్షణ చర్యలతోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాల్సిన సమాచారాన్ని, ఫారం 6,7,8 ఆమోదలం తెలుపుటకు నిర్ణీత ఫారంల వివరాలు, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తణుకు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందర్‌రాజు, తణుకు స్పెషల్ డిప్యూటీ తహసీలార్ ఎస్.శివశంకర్, నియోజకవర్గం నుంచి వచ్చిన 233 మంది బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలి



తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తణుకు అర్బన్: ఆప్కాస్ రద్దు చేస్తే మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమన్నారు. గతంలో విశాఖ హుదూద్ తుఫాన్, కరోనా, విజయవాడ వరదలు వంటి సందర్భాల్లో ప్రాణాలకు తెగించి కార్మికులు పనిచేశారన్నారు. ఆప్కాస్ ఏర్పాటుకు ముందు కార్మికుల వేతనాలు నెలలు తరబడి పెండింగ్‌లో ఉండేవని, మళ్లీ అలాంటి పరిస్థితికి కార్మికులను నెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలు కనుగుణంగా రూ. 26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం మానుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం మునిసిపల్ మేనేజర్‌కి అందజేశారు. సీఐటీయూ నాయకులు యన్. ఆదినారాయణ బాబు, ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయకుమార్, డి. సత్యనారాయణ, రాజు, శ్రీదేవి పాల్గొన్నారు.

అసత్య కథనాలను ప్రసారం చేస్తే కేసుల నమోదు

తాడేపల్లిగూడెం అర్బన్ : అసత్య కథనాలను ప్రసారం చేస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్సై పి.నాగరాజు హెచ్చరించారు. గురువారం ఆయన మట్లాడుతూ గత నెల 30వతేదీన మైనర్ బాలికను లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. ఈవిషయంపై కొన్ని అసత్య వార్తలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో బాలిక తల్లిద్రండులు మనస్థాపానికి గురయ్యారని చెప్పారు. బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ మీడియా వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పి.నాగరాజు చెప్పారు. ప్రచారం చేసే సమయంలో మైనర్ల పేర్లతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువుల పేర్లను ప్రసారం చేయరాదని తెలిపారు.

ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మొద్దు



సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు మధ్య దళారులను నమ్మి ధాన్యాన్ని విక్రయించవద్దని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని మోదుగ గుంట సచివాయలం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏడీఏ పి.మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాకు సొమ్ము జమ అవుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు మిల్లర్లు ఇచ్చిన ధాన్యం సంచులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. సంచులకు చిల్లులు ఉంటే వాటిని పక్కన పెట్టాలన్నారు. అలాగే, ధాన్యం విక్రయించిన వెంటనే ధాన్యం సొమ్ములు వివరాలతో కూడిన షీట్ వస్తుందని, ఆ వెంటనే రైతులు వెళ్లిపోవద్దని, వేలిముద్ర తప్పనిసరిగా వేయాలన్నారు. ధాన్యం సొమ్ములు రైతు ఖాతాకు జమ అవుతాయన్నారు. ధాన్యంలో తేమ శాతం తేడా లేకుండా సర్వర్లకు అనుసంధానించడం జరిగిందన్నారు. ఈ విషయాలను రైతులు గుర్తుంచుకోవాలన్నారు. రైతులు వాట్సాప్ గ్రూపు ద్వారా కూడా ధాన్యాన్ని ఇంటి వద్ద నుంచే విక్రయించవచ్చన్నారు. అయితే, ముందుగా ఏ రోజు ధాన్యం కోస్తున్నది, ఎన్ని బస్తాలు విక్రయిస్తున్నది వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం శివరాంప్రసాద్, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, డీఎస్‌వో ఎన్. సరోజ, డీసీవో ఎం.నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖఅధికారి జడ్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, సర్పంచ్ కట్టా సత్యవతి, ఎమ్పీటీసీ దండుబోయిన విజయదుర్గ, కొమ్ముగూడెం సొసైటీ సీఈవో సీహెచ్ఎస్‌వీకే. శర్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇ.లక్ష్మీకాంతం, మాజీ ఉప సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ, నాయకులు కట్టా సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడార. తణుకు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగురాలైన గుమ్మలూరి దుర్గాభవానికి ఎప్సాన్ ప్రింటర్‌ను అందజేశారు. గురువారం తణుకు గమిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో దాతలు కంచర్ల త్రినాథరావు, చేకూరి ప్రదీప్, పూసరపు నాగ శివ గాంధీ ఇచ్చిన విరాళంతో ప్రింటర్‌ను కొనుగోలు చేసి ఇచ్చినట్లు మానవత రాష్ట్ర కన్వీనర్ విస్తరణ, అభివృద్ధి కమిటీ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి తెలిపారు. దాతలు అందజేసిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని అన్నారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ సభ్యత్వాలు, దాతలు ఇచ్చిన విరాళాలతో తణుకు మానవతా సంస్థ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ఈనెల 7 నుంచి నిర్వహించనున్న చలివేంద్రానికి పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత రూ. 10వేలు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. సంస్థ అధ్యక్షురాలు కటారి శారదాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొల్లం రామకాశి , కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, విశిష్ట దాత చిట్టూరి సుజాత పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



తణుకు యానాదుల కాలనీలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

తణుకు అర్బన్: ఎన్నికల్లో పేదలందరికీ సొంతింటి కల నెరవేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జయంతి కాలనీలో ఎస్టీలు నివసించే ఇళ్లను జిల్లా సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తి చేస్తుంటున్నా నేటికీ మైదాన ప్రాంత గిరిజనులైన ఎస్టీలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారని, విద్య, వైద్యానికి నోచుకోలేని బతుకుల్లో మగ్గిపోతున్నారని వాపోయారు. పిల్లలు చదువులకు దూరమవుతున్నారని, యాచకులుగా, చెత్త ఏరుకునే వారిగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదులు, ఎరుకలు, చెంచులకు ఆధార్ కార్డులు నమోదు చేసుకోవడానికి పుట్టిన తేదీ కోసం డబ్బులు తీసుకోవడం, సర్టిఫికెట్ లేకపోవడంతో ఆధార్ సెంటర్‌లలో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తక్షణం జిల్లా అధికారులు ఆధార్ కార్డులు లేని ఎస్టీలకు ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు నిర్వహించి అందరికీ ఆధార్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, పట్టణ కార్యదర్శి ఎ. అజయకుమారి, సీనియర్ నాయకులు గారపాటి రంగారావు, నాయకులు గోపీ, ఆదినారాయణబాబు, ఎస్టీ నాయకులు కొండ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరపాలని డిమాండ్

పెంటపాడు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించాలని రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు, గూడెం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవ. జీజే జ్యోతి ఆనంద్ పేర్కొన్నారు. గురువారం ఆయన గూడెం ఫెయిత్‌చర్చిలో యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 24న జరిగిన సంఘటన తనను కలిచి వేసిందన్నారు. క్రైస్తవులపై దాడులు చేయడం సర్వ సాధారణమైపోయిందన్నారు. ఈ చర్యను తేలికగా తీసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యుపీఏ నాయకులు కంకిపాటి కృపావరం, సబ్బితి తిమోతి, కాకర్లమూడి సామ్యేల్, కె. నాగేశ్వరరావులు క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఈ సందర్భంగా ఖండించారు. వస్కా డేవిడ్‌రాజు, మానుకొండ ఐజక్‌రాజు, కందికట్ల బెన్నీపాల్, యాళ్ల రాజ్‌పాల్, వస్కా జాన్‌పీటర్, డి. మహేష్‌పాల్, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో సిరులు

రైతుసేవా కేంద్రాలలో నవధాన్యాల కిట్లు లభ్యం



అత్తిలి మండలం మంచిలిలో జీలుగ చల్లిన పొలం

అత్తిలి: ప్రధాన పంటకు ముందు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్(నవధాన్యాలు) సాగు చేపట్టడం ద్వారా సేంద్రియ కర్బనంను పెంచుతుందని, ఈసాగు పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగు అనేది పంటకాలనికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20–30 రకాల వివిధ పంట విత్తనాలను కలిపి వెదజల్లి, సాగుభూమిని సజీవ వేరు వ్యవస్థతో ఎల్లప్పుడూ కప్పబడి ఉండే ప్రక్రియ. పీఎండీఎస్ అనే ప్రక్రియ 365 రోజులు భూమి పంటలతో కప్పబడి ఉండాలనే వ్యూహంతో ముఖ్య భూమిక పోషిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ పీఎండీఎస్ విధానాన్ని నవధాన్యాల సాగు పద్ధతిగా పిలుస్తారు. మామూలు పద్ధతిలో చేసే వ్యవసాయ క్రమంలో దుక్కి చేసి, ఎరువులు వాడి, పంటల మధ్య బీడు పెట్టే ప్రక్రియలో భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గుముఖం పడుతుంది. ప్రకృతి వ్యవసాయ పంటల సాగు సేంద్రియ కర్బనంను పెంచుతుంది. పంటలు కిరణజన్య సంయోగ క్రియ నుండి ఆహారాన్ని తయారు చేస్తాయి. అలా తయారు కాబడ్డ ఆహారంలో 30 శాతం వరకు వేర్ల ద్వారా స్రవించబడి, నేల పైపొరల మీద ఆధారపడ్డ అసంఖ్యాక జీవరాశుల సంఖ్యను పెంపొందిస్తూ మొక్కలు, వాటిపోషకాలను సరఫరా చేయడానికి సహాయపడుతుంది. పంట కోసిన అనంతరం తదుపరి పంట విత్తు వరకు నేలలోకి కార్బన్ విడుదల చేయడం ఆగిపోతుంది. కాబట్టి ఏడాది పొడవునా నిరంతరాయంగా పంటలను పండించడం వల్ల సేంద్రియ కర్బనశాతం సంవత్సరం పొడవునా నేలలోకి చేరుతుంది. ప్రతీ సీజన్‌లో పంటల వైవిధ్యాన్ని మెరుగుపర్చడానికి, బీడుగా ఉండే భూములను పంటలతో సాధారణంగా వేసవినెలలలో పొలాలు బీడుగా ఉంటాయి కాబట్టి పీఎండీఎస్ లోని పలు పంటల ద్వారా ఆదాయం, భూమిలో పోషకాల పెంపుదలతో పాటు పశువులకు నాణ్యమైన పచ్చిమేతగా పొందేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది. ఖరీఫ్ పంట అనంతరం రబీ పంటకు ముందు బీడుగా ఉండే నెలలలో కూడా పంటలు సాగ చేయడానికి రబీ డ్రై సోయింగ్ పద్ధతి అనువైనది.

పీఎండీఎస్ విధానంలో పంటల విత్తనాలు ఇవే...

జీలుగ, జనుము, పిల్లిపెసర, జొన్నలు, పెసలు, ఉలవలు, మినుములు, బొబ్బర్లు, సజ్జలు, నువ్వులు, గోంగూర, పాలకూర, తోటకూర, బీర, అనాభ, దోస, మెంతులు, చుక్కకూర, ఆవాలుతో కూడిన విత్తనాల కిట్‌ను వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందజేస్తుంది.

ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్(నవధాన్యాలు) వల్ల కలిగే ప్రయోజనాలు...

పీఎండీఎస్ పద్ధతి 365 రోజులు భూమి కప్పబడి ఉంచే నిరంతర సాగు ప్రక్రియకు శ్రీకారం చుడుతుంది. వివిధ పంటల వేర్లు భూమిలో వైవిధ్య రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడే వీటి సంతతిని అభివృద్ధి పరుస్తాయి. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలను అందుబాటులోకి తీసుకువచ్చి మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేటట్టు చేస్తాయి. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా ఉపయోగపడుతుంది. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి. నేలలో నీటి నిల్వ సామర్థం పెరుగుతుంది. పలు పంటలు సాగు వలన అదనపు ఆదాయం రైతులకు కలుగుతుంది. నేల కోతకి గురికాదు. జీవ వైవిధ్యం, నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. ప్రధాన పంటలో రసాయనిక ఎరువులు వినియోగం తగ్గుతుంది. ప్రధాన పంటలో కలుపు తగ్గుతుంది. పంటలో చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థం పెరుగుతుంది. ప్రధాన పంట వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.

రైతులు నవధాన్యాల సాగు చేపట్టాలి



రైతులు నవధాన్యాల సాగు చేపట్టాలి. ప్రతీ గ్రామంలో రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటే 15 రకాల విత్తనాలతో కూడిన 10 కిలోల కిట్‌ను రూ. 800లకు అందజేస్తున్నారు. విత్తనాలను నానబెట్టి కోత కోసే ముందు చేలల్లో చల్లాలి. ఈఅవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

టీకే రాజేష్, మండల వ్యవసాయశాఖ అధికారి, అత్తిలి.